# గుళ్లపల్లి సుజాత

## ఎక్సలెన్స్ ఇన్ ఫార్మింగ్

గుళ్లపల్లి సుజాత.

గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి గ్రానైట్ ఎగుమతి వ్యాపారంలో అనుభవం గడించారు.

కానీ... ఒక్కసారిగా తనకు ఏమాత్రం అనుభవం, అవగాహన లేని వ్యవసాయంలోకి దిగిపోయారు.

ఇప్పుడు ఏకంగా నలభై ఎకరాల్లో ప్రకృతి సాగు చేస్తున్నారు. కారణం... అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఒక గొప్ప ఆలోచన.

సుజాత బంధుమిత్రుల్లో చాలామంది వైద్యులున్నారు. వారంతా ఆహారం విషయంలో చాలా పద్ధతులు పాటించేవారు.

అయినాసరే తమవారి కుటుంబాల్లో కొందరు క్యాన్సర్ బారిన పడటం, దీర్ఘకాలిక అనారోగ్యాలకు గురికావడం సుజాతను కలచివేసింది.

వీటన్నింటికీ కారణం రసాయనిక అవశేషాలున్న ఆహారపదార్థాలు తినడమేనని ఆమె గ్రహించారు.

ఎలాంటి రసాయనాలు వాడకుండా పండించిన ఆహారోత్పత్తులే తినాలని నిశ్చయించుకున్నారు.

కానీ అవి అంత సులువుగా దొరికేవి కావు. అలాంటి సమయంలోమనమే ఎందుకు ప్రకృతివ్యవసాయం చేయకూడదు అనుకున్నారామె.

తమ స్వస్థలం ప్రకాశం జిల్లా కొనకమిట్ల మండలం పెదారకట్ల వద్ద రాళ్లు రప్పలతో నిండిన 40 ఎకరాల పొలం తీసుకుని సాగు ప్రయత్నాలు మొదలుపెట్టారు సుజాత. పాలేకర్ పుస్తకాలతో పాటు వివిధ పత్రికలు చదువుతూ ప్రకృతి వ్యవసాయంలో మౌలిక

విషయాలను అవగాహన చేసుకున్నారు.
డ్రిప్ ఇరిగేషన్ సాయంతో పండ్లతోటలు, పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయల సాగు చేసి మంచి దిగుబడి సాధించారు ఈ మహిళారైతు.
వ్యవసాయం చేస్తూనే అనుభవం సంపాదించిన సుజాత ఇప్పుడు తమ బంధువులతోపాటు ఎంతోమందికి స్వచ్ఛమైన ఆహార ఉత్పత్తుల్ని అందించగలుగుతున్నారు. మెకానికల్ ఇంజనీరైన భర్త కోటేశ్వరరావు సాయంతో పొలంలోనే సొంత ఖర్చులవో వాతావరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు సుజాత. 40 ఎకరాల క్షేత్రాన్ని డ్రోన్ కెమెరా ద్వారా పర్యవేక్షిస్తున్న ఈ రైతు టెక్నాలజీని తనకు అనుగుణంగా మలచుకున్నారు.
మొదట్లో తాను పండించిన కూరగాయలు, పప్పుధాన్యాలు బంధువులకు మిత్రులకు ఉచితంగా పంపిణీ చేసి వారిలో అవగాహన పెంచారు.
ఇప్పుడు వ్యవసాయశాఖ అధికారులతో పాటు ఎంతోమంది తమ ఇంటికే వచ్చి ఉత్పత్తులు తీసుకెళ్లడం తనకెంతో సంతోషాన్నిస్తుందంటారామె.
పదిమంది ఆరోగ్యంకోసం సాగునే వృత్తిగా ఎంచుకున్న ఈ ఆదర్శరైతును సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2017, ఎక్సలెన్స్ ఇన్ ఫార్మింగ్ విభాగంలో సత్కరిస్తోంది సాక్షి.